# ఘనంగా టాంటెక్స్ సాహిత్యవేదిక వార్షికోత్సవం



టెక్సాస్, జులై 15 : ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (టాంటెక్స్) సాహిత్యవేదిక ప్రథమ వార్షికోత్సవం డల్లాస్ నగరంలోని స్థానిక హిందూ దేవాలయంలో ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన ప్రముఖ సాహితీవేత్తలు గొల్లపూడి మారుతీరావు, బలభద్రపాత్రుని రమణి, రాళ్ళబండి కవితాప్రసాద్, తెలుగు అకాడమీ సంచాలకులు ఆచార్య ప్రతాప్ రెడ్డి, ప్రముఖ సినీగాయకులు జి.ఆనంద్ విశిష్ట అతిథులుగా హాజరయిన ఈ వేడుకలు ఉదయం పది గంటలకు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం అయ్యాయి.

మంజు తెలిదేవర, గాయత్రి భోగపల్లి మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతం ఆలపించిన పిదప టాంటెక్స్ అధ్యక్షురాలు శ్యామ రుమాళ్ళ స్వాగతోపన్యాసం చేసారు. ఆ తరువాత తానా కార్యదర్శి ప్రసాద్ తోటకూర నిర్వహణలో సాహిత్య గోష్టి మొదటి విభాగం ప్రారంభమయింది. ప్రముఖ నవలారచయిత్రి బలభద్రపాత్రుని రమణిని ఎమ్వీయెల్ ప్రసాద్ సభకు పరిచయం చేసిన పిదప ''తెలుగు సినిమాలపై నవలల ప్రభావం'' అనే అంశంపై ఆవిడ ప్రసంగించారు.

మాలపల్లి మొదలుకొని, శరత్ నవలలు, మాదిరెడ్డి, యద్దనపూడి, కోడూరి, యండమూరి వంటి రచయితల నవలలు సినిమాలుగా తీయబడిన వైనాన్ని, ఆ నవలల్లోని సామాజికాంశాలు ఆయా సినిమాల్లో ప్రతిబింబించబడ్డ విధానాన్ని ఆవిడ సోదాహరణంగా వివరించారు.



తేనీరు విరామం తర్వాత కె.సి చేకూరి నిర్వహణలో గోష్ఠి మూడవ విభాగం మొదలయింది. స్థానిక రచయితలు, కవులు పాల్గొన్న ఈ విభాగంలో వంగూరి చిట్టెన్‌రాజు, శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి, డాక్టర్ రమణ జువ్వాడి, ఆచార్య పుదూర్ జగదీశ్వరన్, చంద్రశేఖర్ కన్నెగంటి, నందివాడ ఉదయభాస్కర్, గాయత్రి భోగవల్లి, డాక్టర్ బోయరెడ్డి సుబ్రమణ్యం, డాక్టర్ తారాకుమార్‌రెడ్డి, డాక్టర్ నరసింహారావు తదితరులు ప్రసంగించారు. డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తన జానపదగీతాలతో సభను ఉ హుషారెత్తించారు.

సాయంకాలం విశ్వనాథం పులిగండ్ల నిర్వహణలో నాలుగవ విభాగంలో శాస్త్రీయసంగీత విభావరి మొదలయింది. శాంత పులిగండ్ల నేతృత్వంలో మంజు తెలిదేవర, గాయత్రి భోగవల్లి, శ్రీదుల అపర్ణ, ధర్మవరపు శిరీష, అవధానుల విశాల బృందం ఆలపించిన అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలు సభను రసజగత్తులో ఓలలాడించాయి.



అనంతరం విశిష్ట అతిథులందరినీ టాంటెక్స్ అధ్యక్షురాలు శ్యామ రుమాళ్ల, ఇతర కార్యవర్గ సభ్యులు దుశ్శాలువలతో, జ్ఞాపికతో సత్కరించారు. సాహిత్యవేదిక ఆవిర్భావానికి పునాది వేసిన వ్యవ స్థాపకులు ప్రసాద్ తోటకూరను టాంటెక్స్ సాహిత్య వేదిక తరపున విశిష్ట అతిథులందరూ కలసి సత్కరించారు. హిందు దేవాలయానికి, భోజన సదుపాయం కల్పించిన సరిగమ, కోకిల, రుచి ప్యాలెస్ తదితర ఇండియన్ రెస్టారెంట్లకు, సభ నిర్వహణకు సహకరించిన రాజేష్ పిల్లమర్రి, రాజారెడ్డి, అనంత్ మల్లవరపు, సురేష్ మండువ, శ్రీనివాస్ వీరపెల్లి, ఎన్నెమెస్ రెడ్డి, చంద్రబందార్, సాంబ దొడ్డా, రాధాకృష్ణ ఎర్రంశ్రీని తదితరులకు ధన్యవాదాలు తెలుపుతూ కెసి చేకూరి వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.